సీఎం కప్‌లో యోగాసన పోటీలు

మేనేజింగ్ డైరెక్టర్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ సోనీ బాలాదేవిని కలిసిన జిల్లా యోగా సభ్యులు

కామారెడ్డి, నవంబర్ 22 : రాష్ట్రంలో త్వరలో సీఎం కప్ పోటీలు నిర్వహించనున్నారు. దీంట్లో యోగాసన పోటీలను చేర్చినందుకు శుక్రవారం హైదరాబాద్ లాల్ బహదూర్ స్టేడియంలో మేనేజింగ్ డైరెక్టర్ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ, వైస్ చైర్మన్ సోనీ బాలాదేవిని కామారెడ్డి జిల్లా యోగా సభ్యులు శుక్రవారం కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో తెలంగాణ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ రావు, ప్రధాన కార్యదర్శి నందనం కృపాకర్, జాయింట్ సెక్రెటరీ ఆర్గనైజింగ్ రాంరెడ్డి, తోట సతీశ్, డిప్యూటీ డైరెక్టర్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

బుడ్మి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణను ఉపాధ్యాయులతో కలిసి పరిశీలిస్తున్న డీఈవో రాజు

బాన్సువాడ రూరల్, నవంబర్ 22 : పదో తరగతి వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో రాజు సూచించారు. బాన్సువాడ మండలంలోని బుడ్మి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. పాఠశాలలోని మౌలిక సదుపాయాలు, విద్యార్థుల సంఖ్య తదితర అంశాలపై ఆరా తీశారు. తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని బోధించాలని ప్రధానోపాధ్యాయుడికి, ఉపాధ్యాయులకు సూచించారు.

మాల మహానాడు గ్రామ కమిటీ ఎన్నిక

బాన్సువాడ రూరల్, నవంబర్ 22 : బాన్సువాడ మండలంలోని బోర్లం గ్రామ మాల మహానాడు గ్రామ కమిటీని అంబేద్కర్ సంఘం బాన్సువాడ డివిజన్ ఉపాధ్యక్షుడు నెర్రె నర్సింహులు ఆధ్వర్యంలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా బేగరి సాయిలు, ఉపాధ్యక్షుడిగా గుజ్జరి గంగారాం, ప్రధాన కార్యదర్శిగా మన్నె గంగారాం, కోశాధికారిగా పోతురాజు సాయిలు, సలహాదారుడిగా జెగ్గ ఆనంద్‌ను ఎన్నుకున్నారు. సంఘం సభ్యులు మన్నెచిన్న సాయిలు, గంగారాం తదితరులు ఉన్నారు.

జోరుగా గంజాయి దందా!

- మత్తుకు బానిసవుతున్న యువత
- పట్టించుకోని ఎక్సైజ్ శాఖ అధికారులు

బీబీపేట్(దోమకొండ), నవంబర్ 22 : దోమకొండ మండలంలో జోరుగా గంజాయి దందా సాగుతున్నది. దోమకొండ మండల కేంద్రంతోపాటు అంచనూర్, ముత్యంపేట తదితర గ్రామాల్లో గంజాయి విక్రయిస్తుండడంతో యువకులు మత్తుకు బానిసలవుతున్నారు. దోమకొండ గ్రామ శివారులోని(గుండ్ల చెరువు) మినీ స్టేడి యం సమీపంలో, పలుగడ్డ బహిరంగా ప్రదేశం, దోమకొండ నుంచి అంబారీపేటకు గ్రామానికి వెళ్లే రోడ్డులో రాత్రి సమయంలో యువకులు గంజాయి తీసుకుంటున్నట్లు సమాచారం. మత్తు పదార్థాలకు బానిసైన యువత ఆ మత్తులో తమ జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. దోమకొండ, అంచనూర్, ముత్యంపేట తదితర గ్రామాల శివారులో పార్టీల పేరుతో గంజాయి తాగుతున్నట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా పోలీస్, ఎక్సైజ్ సిబ్బంది పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నా యి. మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో కనీసం పోలీస్ సిబ్బంది, ఎక్సైజ్ అధికారులు మత్తు పదార్థాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించడం లేదనే విమర్శలు కూడా ఉన్నాయి. ఐదు నెలల క్రితం బీబీపేటకు చెందిన వ్యక్తి నిజామాబాద్‌లో గంజాయితో పోలీసులకు పట్టుబడ్డాడు. ఇటీవల మండలంలోని తుజాల్‌పూర్, యాడారం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులను గంజాయితో ఉండగా భిక్కనూర్ పోలీసులు బీటీఎస్ వద్ద పట్టుకున్న విషయం తెలిసిందే. ఇంత జరుగుతున్నా ఎక్సైజ్ సిబ్బంది తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు స్పందించి మత్తు పదార్థాలపై యువతకు అవగాహన కల్పించి జీవితాలు నాశనం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

గంజాయిని విక్రయిస్తే చర్యలు

గంజాయిని విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. యువత గంజాయి మత్తు పదార్థాలకు బానిసై జీవితాలు నాశనం చేకోవద్దు. గంజాయిపై గ్రామాల్లో యువతకు, గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నాం.

- సంపత్‌కుమార్, సీఐ, భిక్కనూర్

సౌత్ క్యాంపస్‌లో వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

భిక్కనూరు, నవంబర్ 22 : డిసెంబర్ 1న ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ ఎన్ఎస్ఎస్ సహకారంతో శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఎస్ 5, 6 యూనిట్ల ఆఫీసర్లు డాక్టర్ అంజయ్య, హరిత మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా పోటీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఎయిడ్స్ వ్యాధి నియంత్రణ, నివారణపై అవగాహన కోసం ఈ వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు డిసెంబర్ 1వ తేదీన నిర్వహించే సభలో బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ మోహన్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం

రాజంపేట్, నవంబర్ 22 : ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని 23, 24వ తేదీల్లో నిర్వహించనున్నట్లు తహసీల్దార్ అనిల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. శని, ఆదివారాల్లో నిర్వహించే నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. నూతన ఓటరు నమోదు కోసం ఫారం నంబర్ 6, తొలగింపునకు 7, తప్పులు సరిదిద్దుకొనేందుకు 8వ నంబర్ ఫారం నింపి సంబంధిత బూత్ లెవల్ అధికారులకు అందజేయాలని తహసీల్దార్ సూచించారు.

గురుకుల పాఠశాల తనిఖీ

విద్యార్థులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

నస్రుల్లాబాద్, నవంబర్ 22 : మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలను సబ్ కలెక్టర్ కిరణ్మయి శుక్రవారం తనిఖీ చేశారు. విదార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థు చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. అనంతరం తహసీల్, ఎంపీడీవో కార్యాలయాల్లో సమగ్ర కుటుంబ సర్వే నమోదును పరిశీలించారు. కార్యక్రమంలో డీటీ భావయ్య, ఎంపీడీవో సూర్యకాంత్, పాఠశాల ప్రిన్సిపాల్ మాధవ రావు తదితరులు ఉన్నారు.

సర్వే ఆన్‌లైన్ ప్రక్రియ పరిశీలన

బీబీపేటలో ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న మండల స్పెషల్ ఆఫీసర్ సతీశ్‌యాదవ్

బీబీపేట, నవంబర్ 22 : బీబీపేటతోపాటు తుజాల్‌పూర్, ఇస్సానగర్, మాందాపూర్, మల్కాపూర్, యాడారం తదితర గ్రామాల్లో దాదాపు 94 శాతం సర్వే పూర్తి కావడంతో బీబీపేటలోని రైతు వేదికలో కంప్యూటర్ సిబ్బంది వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయిస్తున్న ప్రక్రియను మండల స్పెషల్ ఆఫీసర్ సతీశ్‌యాదవ్ శుక్రవారం పరిశీలించారు. వివిధ అంశాలపై సిబ్బందితో చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్, కార్యాలయ సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు బిల్లుల అందజేత

బాన్సువాడలో లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ, నవంబర్ 22 : బాన్సువాడ నియోజకవర్గంలోని బీర్కూర్, బాన్సువాడ మండలంలోని తాడ్కోల్ గ్రామాలకు చెందిన 34 మందికి బాన్సువాడలోని రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడు పోచారం శ్రీనివాసరెడ్డి తన నివాసంలో డబుల్ బెడ్ రూ ఇండ్ల లబ్ధిదారులకు బిల్లులను శుక్రవారం అందజేశారు. నాయకులు సొసైటీ అధ్యక్షుడు గంగుల గంగారాం, ఎజాస్, జిల్లా యువజన విభాగం నాయకుడు మధుసూదన్‌రెడ్డి, పిట్ల శ్రీధర్, మాజీ సర్పంచ్ రాజు తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చెక్కును అందజేస్తున్న షబ్బీర్‌అలీ

కామారెడ్డి, నవంబర్ 22 : జిల్లా కేంద్రంలోని విద్యానగర్ కాలనీకి చెందిన వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ శుక్రవారం పంపిణి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, పండ్ల రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, కౌన్సిలర్ అన్వర్ అహ్మద్, చంద్రశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పంపరి లక్ష్మణ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి, నవంబర్ 22 : తెలంగాణ మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మైనార్టీ స్టడీ సర్కిల్ అండ్ కెరీర్ కౌన్సెలింగ్ సెంటర్ హైదరాబాద్ ద్వారా ఉచిత టీజీపీఎస్‌సీ గ్రూప్-2 ఫుల్‌లెన్త్ మాక్ టెస్ట్‌లను నిర్వహిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి దయానంద్ తెలిపారు. మైనార్టీ (ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, జైను, బుద్ధిస్ట్, పార్శీ) అభ్యర్థులు ఈ నెల 29వ తేదీలోగా జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖాధికారి కార్యాలయంలోని రూం నంబర్ 222లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రెండు తలల దూడ జననం

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 22: మండలంలోని గండిమాసానిపేట్ గ్రామంలో శుక్రవారం ఓ గేదె రెండు తలల దూడకు జన్మనిచ్చింది. గ్రామంలోని పట్ల శ్రీనివాస్‌కు చెందిన గేదెకు రెండు తలల దూడ జన్మించడంతో దానిని చూడడానికి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పశువైద్యాధికారులు అందుబాటులో లేకపోవడంతో దూడ మరణించిందని రైతు శ్రీనివాస్ తెలిపాడు.

దిశ కమిటీ జిల్లా సభ్యుడిగా రాజు

లింగంపేట, నవంబర్ 22: దిశ కమిటీ జిల్లా సభ్యుడిగా దేశ్‌ముఖ్ రాజును నియమిస్తున్నట్లు డీఆర్డీఏ అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో నిర్వహించే అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి దిశ కమిటీని ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. జహీరాబాద్ ఎంపీ సురేశ్ శెట్కార్ చైర్మన్‌గా, కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ కార్యదర్శిగా, ఎమ్మెల్యేలు, మున్సిపల్ చైర్మ న్లు సభ్యులుగా ఉంటారని పేర్కొన్నారు. ఎన్‌జీవోల విభాగం నుంచి రాజును సభ్యుడిగా ఎంపిక చేసినట్లు తెలిపారు. దీంతో ఆ యన ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్
WANTED
★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-338964
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్

లింగంపేట కొనుగోలు కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ విక్టర్, చిన్నకొడప్‌గల్ శివారులో స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారి

లింగంపేట, నవంబర్ 22: ధాన్యం విక్రయించిన రైతుల వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అదనపు కలెక్టర్(రెవెన్యూ) విక్టర్ కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు సూచించారు. లింగంపేటలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. కేంద్రంలో ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ నరేందర్‌గౌడ్, ఇన్‌చార్జి డీసీవో రామ్మోహన్, సీఈవో పెంటయ్యతోపాటు ధాన్యం కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జీలు, రైతులు ఉన్నారు.

ట్యాబ్ ఎంట్రీలు త్వరగా చేయాలి..

రైతులకు డబ్బుల చెల్లింపులో జాప్యం లేకుండా చూసేందుకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు త్వరగా ట్యాబ్ ఎంట్రీ చేయాలని అదనపు కలెక్టర్ విక్టర్ సహకార సంఘం సిబ్బందికి సూచించారు. తాడ్వాయి మండల కేంద్రంలో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. సహకార సంఘం పరిధిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ట్యాబ్‌లో నమోదు చేసిన వివరాలతో రైతుల ఖాతాలో డబ్బులు జమ అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్, ఇన్‌చార్జి డీసీవో రామ్మోహన్, తాడ్వాయి సహకార సంఘం చైర్మన్ కపిల్‌రెడ్డి, సీఈవో నర్సింహులు, సహకార సంఘం సిబ్బంది ఉన్నారు.

తహసీల్ కార్యాలయం తనిఖీ..

పెద్దకొడప్‌గల్, నవంబర్ 22: పిట్లం తహసీల్ కార్యాలయాన్ని అడిషనల్ కలెక్టర్ విక్టర్ శుక్రవారం సందర్శించారు. కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం చిన్నకొడప్‌గల్ గ్రామ శివారులో 161 జాతీయ రహదారి పక్కన కొత్తగా పెట్రోల్ పంపు ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, గిర్దావర్ శీతల్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో నా అనుమతితోనే పార్టీ పదవులు

- మాజీ ఎమ్మెల్యే గంగారాం కుటిల రాజకీయాలు మానుకోవాలి
- జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

బిచ్కుంద, నవంబర్ 22: నియోజకవర్గంలో తన అనుమతి లేనిదే ఎవరికీ పార్టీ పదవులు రావని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. బిచ్కుందలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మద్నూర్ మండలానికి చెందిన ఓ నాయకుడిని కాంగ్రెస్ పార్టీ బహిష్కరించిందని తెలిపారు. ఇతర పార్టీల నుంచి బహిష్కరించిన వారిని కాంగ్రెస్ అక్కున చేర్చుకుందని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే గంగారాం తన సోదరుడి కుమారుడు అరవింద్‌ను అడ్డుపెట్టుకొని కుటిల రాజకీయాలు చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. అరవింద్‌ను గత ఏడాది కాంగ్రెస్ నుంచి బహిష్కరించినా.. పనికి రాని పోస్టు తీసుకొని కార్యకర్తలను మభ్యపెడుతున్నాడన్నారు. బిచ్కుంద మాజీ జడ్పీటీసీ చరిత్ర జడ్పీ గెస్ట్‌హౌస్ గోడలకు అడిగితే తెలుస్తుందని ఎద్దేవా చేశా రు. జడ్పీలో వాచ్‌మన్ పోస్టు కావాలంటే ఆ యనకు ఇప్పిస్తానన్నారు. తాటాకు చప్పుళ్లకు తాను భయపడబోనని, నియోజకవర్గంలో అంతా సెట్ చేస్తానని చెప్పారు. అంతకుముందు ఆయన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పార్టీకోసం కష్టపడిన వారికి పదవులు వస్తాయని చెప్పారు. సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు గంగాధర్, పుల్కల్ సొసైటీ చైర్మన్ భీమ్‌పటేల్, వైస్ చైర్మన్ శంకర్, నాయకులు గోపాల్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, సాయిని అశోక్, రవి పటేల్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే షిండే పరామర్శ

రాచప్ప కుటుంబీకులను పరామర్శిస్తున్న జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే

బిచ్కుంద, నవంబర్ 22: హస్గుల్ మాజీ ఉపసర్పంచ్ రాచప్ప తీవ్ర అనారోగ్యంతో ఇటీవల మరణించాడు. బాధిత కుటుంబా న్ని మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే శుక్రవారం పరామర్శించారు. వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారితో మాట్లాడి మనోధైర్యాన్ని ఇచ్చారు. ఆయనవెంట మా ర్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నాల్చార్ రాజు, హస్గుల్ మాజీ సర్పంచ్ మారుతి, నాయకు లు అన్వర్, గణేశ్ గొండ తదితరలు ఉన్నా రు.

వాహనాలను దారికి అడ్డంగా పెట్టి నిరసన వ్యక్తంచేస్తున్న కూరగాయల వ్యాపారులు

డెయిలీ మార్కెట్‌ను మార్చాలని నిరసన

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 22: ఎల్లారెడ్డి పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద కిరాణా మార్కెట్‌లో ఉన్న డెయిలీ మార్కెట్‌ను మార్చాలని తైబజార్ నిర్వాహకుడు భాస్కర్ కూరగాయల వ్యాపారులతో కలిసి నిరసన చేపట్టాడు. శుక్రవారం పట్టణంలోని డెయిలీమార్కెట్‌లో రోడ్డుపై వాహనాలను అడ్డుపెట్టి నిరసన తెలిపాడు. డెయిలీ మార్కెట్‌లో కిరాణా దుకాణాల ముందు రోడ్డుపై కూరగాయలు పెట్టి వ్యాపారులు విక్రయిస్తున్నారు. దీంతో ప్రజలు కిరాణా దుకాణాలకు రావడానికి ఇబ్బంది అవుతున్నదని, వ్యాపారులు కూరగాయలు అమ్మేవారికి కూర్చోనివ్వడం లేదు. కూరగాయలు విక్రయించే వారంతా కలిసి తైబజార్ నిర్వాహకున్ని ఈ విషయమై సంప్రదించారు. అక్కడ విక్రయించేందుకు వ్యాపారస్తులు ఒప్పుకోకపోవడంతో తైబజార్ నిర్వాహకుడు భాస్కర్ కూరగాయలు అమ్మేవారితో కలిసి రోడ్డుకు అడ్డుగా వాహనాలు నిలిపి ధర్నా చేశాడు. అధికారులు స్పందించి కూరగాయల మార్కెట్‌కు వేరే స్థలాన్ని చూపించాలన్నారు. దీనిపై స్థానిక కిరాణా దుకాణాల యజమానులు మాట్లాడుతూ.. ప్రతిరోజూ కూరగాయలు అమ్మేవారు కిరాణా దుకాణాల ముందు కూర్చోవడంతో గిరాకీ కావడం లేదన్నారు. కూరగాయలు విక్రయించే వారు మరో ప్రాంతం చూసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వినియోగదారులు సహకరించాలి : ఏఈ

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 22: ఎల్లారెడ్డి పట్టణం, మత్తమాల, పెద్దారెడ్డి గ్రామాల పరిధిలోని నేడు శనివారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఇన్‌చార్జి ఏఈ వెంకటస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని సూచించారు.

తెలుగులో విద్యుత్ సమాచారం

లింగంపేట, నవంబర్ 22: విద్యుత్ సేవలు, వ్యవసాయ కనెక్షన్లకు సంబంధించిన సమాచారం ఇక నుంచి తెలుగులో అందించనున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ మల్లేశం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యుత్ సమాచారం ఇంగ్లిష్‌లో కాకుండా తెలుగులో అందజేస్తామని పేర్కొన్నారు. వ్యవసాయ క్షేత్రాల్లో సమస్యలను పరిష్కరించేందుకు 'పొలం బాట' నిర్వహిస్తున్నామని తెలిపారు. జీరో విద్యుత్ ప్రమాదాల కార్యక్రమాన్ని చేపడుతున్నామని పేర్కొన్నారు. విద్యుత్ శాఖకు సంబంధించిన 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి తగిన సమాచారం పొందాలని సూచించారు.

నీటి సమస్యకు పరిష్కారం

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 22: మండలంలోని అల్మాజీపూర్ గ్రామంలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించినట్లు మాజీ జడ్పీటీసీ ఊషాగౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామస్తుల విన్నపం మేరకు స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి రెండు వందల మీటర్ల సింగిల్ ఫేజ్ మోటర్ పైప్‌లైన్ వేయించి సమస్యను పరిష్కరించామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాజీ జడ్పీటీసీకి కృతజ్ఞతలు తెలిపారు.

బుల్లెట్ చోరీ

లింగంపేట, నవంబర్22 : లింగంపేట మండల కేంద్రంలో గురువారం రాత్రి ఓ బుల్లెట్ వాహనం చోరీ అయినట్లు బాధితుడు బొల్లారం క్రాంతి తెలిపారు. స్థానిక కో-ఆపరేటివ్ బ్యాంకు వెనుక ఉండే శీలమంతు నరేశ్ ఇంటి వద్ద నుంచి గుర్తు తెలియని వ్యక్తులు టీఎస్ 16ఈజే 0604 నంబర్ గల బుల్లెట్ వాహనాన్ని అపహరించుకుపోయారని పేర్కొన్నాడు. ఈ విషయమై శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై ప్రకాశ్ తెలిపారు.

'బడి పిల్లల కథల సింగిడి' పుస్తకావిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీఈవో రాజు

రామారెడ్డి, నవంబర్ 22: 'బడి పిల్లల కథల సింగిడి' పుస్తకాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి రాజు శుక్రవారం ఆవిష్కరించారు. మండలంలోని గిద్ద గ్రామ జిల్లా పరిషత్ పాఠశాలలో పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. పుస్తకం విశిష్టతను విద్యార్థులకు వివరించారు. 'నలుపు - తెలుపు' అనే కథకు గిద్ద పాఠశాలకు రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఆనంద్‌రావు, ప్రధానోపాధ్యాయుడు కన్నయ్య, కవులు వీఆర్ శర్మ, సుంకటి నరేశ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.